మంగళవారం

21-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 341, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




## సమస్యలు తీర్చలే.. ఓటు వేసేది లేదు

వివరాలు 2లో



## ఇక్కడ గోవులను దత్తత ఇస్తారు

వివరాలు 4లో



## హైదరాబాద్ లో కో లివింగ్ కల్చర్..?

వివరాలు 4లో

# ప్రజల విశ్వాసమే బ్రాండ్ మోడీ

- తనపై వస్తున్న ప్రశంసలకు ఆసక్తి స్పందన
- 2047 నాటికి వికసిత భారతమే లక్ష్యం
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ



**ముందడుగు జాతీయం:**

దేశల ప్రజల విశ్వాసమే తనకు 'బ్రాండ్ మోడీ' పేరు వచ్చిందని తనపై వస్తున్న ప్రశంసలకు ఆసక్తికరంగా స్పందించారు. పదవులు, హోదా ఇలా గుర్తింపు సాధించేందుకు ఈ భూమ్మీదకు రాలేదని, ప్రజలకు తనవంతు సేవ చేసేందుకే తన జీవితం అంకితమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. తాను కేవలం కార్యసాధకుడిని మాత్రమేనని అన్నారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ''2047 నాటికి దేశాన్ని వికసిత భారత్‌గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. దాన్ని సాధించేందుకు నేను ఏం చేసేందుకైనా వెనుకాడను. నేను కేవలం కార్యసాధకుడిని మాత్రమే. ఎవరు ఎక్కడ ఉండాలో, ఏమవ్వాలో నిర్ణయించేది దేశ ప్రజలే. 'బ్రాండ్ మోదీ' అనే పేరు సాధించేందుకు నేనేం ప్రత్యేకంగా ఏం చేయలేదు. రెండు దశాబ్దాలకు పైగా ఈ ప్రజా జీవితంలో ప్రజల్లో నేను చూరగొన్న విశ్వాసం ఫలితమే ఆ పేరు. వారి జీవితాలను బాగు చేసేందుకు నేను చేస్తున్న నిస్వార్థ సేవ, నిరంతర ప్రయత్నాలు వారు ప్రత్యక్షంగా చూస్తున్నారు. నేనూ మనిషినే. తప్పులు జరుగుతుంటాయి. కానీ, ఇప్పటివరకు చెడు ఉద్దేశంతో నేనేదీ చేయలేదు'' అని మోదీ తెలిపారు..

## కవితకు బెయిల్ కష్టమేనా..?

- జూన్ 3 వరకు కవిత రిమాండ్
- సిబిఐ, ఈడీ కేసులో కస్టడీ పొడిగింపు
- రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ

**ముందడుగు ఢిల్లీ:**



సీబీఐ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం పొడిగించింది. జూన్ 3 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు జడ్జి కావేరి బవేజా ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మే 20వరకు పొడిగించిన రిమాండ్ గడువు నేటితో ముగియడంతో అధికారులు తాజాగా కోర్టులో మిగతా 2లో

## దేశంలో ముగిసిన ఐదో దశ పోలింగ్

- 49 నియోజకవర్గాల్లో 695 మంది పోటీ
- దాదాపు 57.38 శాతం పోలింగ్ నమోదు

**ముందడుగు జాతీయం:**



దేశంలో ఐదో దశ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాల్లో మొత్తం 695 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం.. సాయంత్రం ఏడు గంటలకు దాదాపు 57.38 శాతం మిగతా 2లో

## త్వరలో ఉబెర్ బస్ సేవలు

వివరాలు 2లో

## కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలి

### కోర్టును ఆశ్రయించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

**ముందడుగు ఢిల్లీ:**




ఢిల్లీ లిక్కర్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని 14 రోజుల పాటు పొడిగించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మిగతా 2లో

# త్వరలో ఉబెర్ బస్ సేవలు

## మొదటగా ఢిల్లీలో సేవలు ప్రారంభం




**ముందడుగు ఢిల్లీ:**

ఉబర్ సంస్థ త్వరలో బస్సు సేవలను ప్రారంభించనుంది. మొదట ఈ సేవలను దేశ రాజధాని నగరం ఢిల్లీలో ప్రారంభించనుంది. ఢిల్లీ ప్రీమియం బస్ స్కీమ్ కింద ఇకపై బస్సులను నడపనుంది. ఈ మేరకు ఢిల్లీ రవాణా మంత్రిత్వ శాఖ నుంచి తాజాగా లైసెన్స్ అందుకుంది. ఈ తరహా లైసెన్స్ జారీ చేసిన తొలి రవాణా శాఖ ఢిల్లీనే. దీన్ని అందుకున్న తొలి అగ్రిగేటర్‌గా ఉబర్ నిలిచింది. ఏడాదిగా ఢిల్లీఎన్‌సీఆర్‌తో పాటు, కోల్‌కతాలోనూ ప్రయోగాత్మకంగా ఈ సేవలు నడుపుతున్నామని ఉబర్ షటిల్ ఇండియా హెడ్ అమిత్ దేశ్‌పాండే చెప్పారు. ఢిల్లీలో బస్సులకు విపరీతమైన డిమాండ్ ఉన్నట్లు గమనించామన్నారు. ఇప్పుడు అధికారికంగా తమ సేవలను ఢిల్లీలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. బస్సు సర్వీసులకు వారం ముందు నుంచే ప్రయాణికులు బుక్ చేసుకోవచ్చని ఉబర్ తెలిపింది. బస్సు రాబోయే సమయం, బస్సు లైవ్ లొకేషన్, బస్సు రూట్లను ఎప్పటికప్పుడు ఉబర్ యాప్‌లో తెలుసుకోవచ్చని పేర్కొంది. ఒక్కో సర్వీసులో 1950మంది ప్రయాణించడానికి వీలుంటుందని తెలిపింది. ఉబర్ టెక్నాలజీ సాయంతో స్థానిక ఆపరేటర్లు వీటిని నడుపుతారని ఉబర్ తెలిపింది.

# కవితకు బెయిల్ కష్టమేనా..?

మొదటిపేజీ తరువాయి

హాజరు పరచగా.. రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈడీ కేసులోనూ కవితకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీటుపై కోర్టులో వాదనలు జరిగాయి. కవిత సహా నలుగురు వ్యక్తులు దామోదర్, ప్రిన్స్ కుమార్, అరవింద్‌సింగ్, చరణ్‌ప్రీత్‌పై చార్జిషీటు దాఖలు చేశామని, వారి పాత్రపై ఆధారాలను పొందుపరిచామని ఈడీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని వాదించారు. చార్జిషీటు దాఖలు చేసిన తర్వాత కస్టడీ అవసరం లేదని, విడుదల చేయాలని కవిత తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఇరువురి వాదనలు విన్న తర్వాత జ్యుడీషియల్ కస్టడీని జూన్ 3 వరకు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది.

# సమస్యలు తీర్చలే.. ఓటు వేసేది లేదు

## మూడు గ్రామాల్లో ఎన్నికల బహిష్కరణ




**ముందడుగు జాతీయం:**

దేశంలో ఐదో దశ లోక్‌సభ ఎన్నికల్లో 49 లోక్‌సభ స్థానాలకు సోమవారం పోలింగ్ జరుగుతోంది. అన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. కానీ ఉత్తరప్రదేశ్‌లోని రెండు గ్రామాల్లో, జార్ఖండ్‌లోని ఓ గ్రామంలో మాత్రం ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లా హిసామ్‌పూర్ మఢ్డో గ్రామానికి చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తప్పకుండా రైల్వే ట్రాక్‌ను దాటాల్సిందే. ఇలా రైల్వే ట్రాక్‌ను దాటే ప్రయత్నంలో ఇప్పటికే 12 మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మించాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా యూపీలో బారాబంకి జిల్లాకు చెందిన పరహాజీ గ్రామ వాసులది కూడా ఇదే బాధ. వారి గ్రామానికి ఆనుకుని ఉన్న నదిపై వంతెన లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జార్ఖండ్ రాష్ట్రం హజారీబాగ్ లోక్‌సభ నియోజకవర్గంలోని కుసుంభా గ్రామానిది కూడా అదే దుస్థితి. హజారిబాగ్‌లోని ఎన్‌టీపీసీ ప్లాంట్ కారణంగా కుసుంభా గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే అడ్డంకిగా మారింది. దాంతో వారి రాకపోకల కోసం అండర్ పాస్ నిర్మించి ఇస్తామని ఎన్‌టీపీసీ చెబుతోంది. కానీ అండర్ పాస్‌తో తాగునీళ్ల సరఫరాకు, నిత్యావసరాల సరఫరాకు, వైద్య సేవలకు తాము ఎదుర్కోవాల్సి వస్తుందని, కాబట్టి అండర్‌పాస్‌కు బదులుగా బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కారణాలతోనే మూడు గ్రామాల ప్రజలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.




# పట్టుబడుతున్న మారని అధికారులు

## ఏసిబి వలలో ఒకే రోజు ముగ్గురు అధికారులు

**ముందడుగు తెలంగాణ**

తెలంగాణలో సోమవారం ఒక్కరోజు ఏసిబి వలలో ముగ్గురు అధికారులు పట్టుబడ్డారు. గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో రూ.4.5 లక్షలతో శ్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ నిర్మించాడు. ఈ క్రమంలోనే ఐడీఓసీలోని పంచాయత్ రాజ్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ జోగినపల్లి భాస్కర్‌రావు.. శ్మశానవాటిక కాంపౌండ్‌వాల్ నిర్మాణ బిల్లును వేగవంతం చేయడానికి కాంట్రాక్టర్ వెంకటేశ్ నుంచి లంచం డిమాండ్ చేశాడు. బిల్లును చీఫ్ ప్లానింగ్ అధికారికి పంపేందుకు భాస్కర్‌రావు లంచం డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించాడు. భాస్కర్ రావు రూ.7వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రంగారెడ్డి జిల్లా నానాజ్‌పూర్ గ్రామానికి చెందిన పంచాయతీకార్యదర్శి అధికా రెడ్డి, బిల్ కలెక్టర్ శ్రీ బాల్‌రాజ్ ఇంటి నంబర్ కేటాయింపు, కాంపౌండ్ వాల్ నిర్మాణ అనుమతి కోసం రూ.35,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. హన్మకొండ జిల్లా, కమలాపూర్ మండలానికి చెందిన ఒక రైతు తన తండ్రి తనకు బహూకరించిన భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్ళగా తహశీల్దార్ & జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పాలకుర్తి మాధవి 20 వేలరూపాయలు డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా ఆ తహసీల్దార్ ఆదేశానుసారంగా తమ కార్యాలయములో ధరణి సైట్ ఆపరేటర్ గా పనిచేసే రాకేశ్ 5 వేల రూపాయలు లంచంగా తీసుకుంటుండగా వల పన్ని ఇద్దరిని (ఆపరేటర్ & తహశీల్దార్) ఏసిబి అధికారులు పట్టుకున్నారు.

# దేశంలో ముగిసిన ఐదో దశ పోలింగ్

మొదటిపేజీ తరువాయి

పోలింగ్ నమోదైంది. అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 73 శాతం, అత్యల్పంగా మహారాష్ట్రలో 48.88 శాతం ఓటింగ్ నమోదైంది.

ఎన్నికల సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో చెదురుమదురు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒడిశా తదితర రాష్ట్రాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలను ఏడు విడతల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దేశంలో మొత్తంగా 543 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. అయిదో దశతో కలిపితే 428 సీట్లకు పోలింగ్ పూర్తయ్యింది. ఈసీ వివరాల ప్రకారం ఇప్పటివరకు నాలుగు దశల్లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 66.95 శాతం పోలింగ్ నమోదైంది.

# కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలి

మొదటిపేజీ తరువాయి

సోమవారం కోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యారు. జూన్ 2న ఆయనను లొంగిపోవాలని కోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు గతంలో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని సోమవారం (మే20) వరకు పొడిగించింది. ఈ కేసులో ఈడీ మద్యం పాలసీకి సంబంధించిన చార్జిషీట్ దాఖలు చేసింది. ఇందులో అరవింద్ కేజ్రీవాలతో పాటు ఆయనకు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీని నిందితులుగా పేర్కొంది. సిట్టింగ్ సీఎం, రాజకీయ పార్టీ మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కోవడం ఇదే తొలిసారి. ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా 200 పేజీల అనుబంధ చార్జిషీట్‌ను త్వరలోనే విచారణకు స్వీకరించే అవకాశం ఉంది. నిందితులపై మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అభియోగాలు మోపాలని కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను ప్రధాన సూత్రధారి అని ఈడీ తెలిపింది. సీఎంతో పాటు ఆప్ నేతలు, ఇతరులతో కుమ్మక్కయ్యారని ఆరోపించింది. ప్రస్తుతం రద్దు చేసిన ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో కేజ్రీవాల్ కీలక పాత్ర పోషించారని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు సుప్రీంకోర్టుకు తెలిపారు. కేజ్రీవాల్ ఒక సెవెన్ స్టార్ హోటల్‌లో బస చేశారనేందుకు తమ వద్ద ప్రత్యక్ష సాక్ష్యం ఉందని చెప్పారు. మద్యం పాలసీలో వచ్చిన డబ్బులను గోవా ఎన్నికలకు మళ్లించినట్లుగా ఈడీ ఆరోపిస్తున్నది. ఈ ఆరోపణలు కేజ్రీవాల్ కొట్టిపడేశారు.

ముందడుగు
మంగళవారం, 21-5-2024, హైదరాబాద్

# మహిళ ప్రాణం తీసిన ట్రోలింగ్ రాబందులు

## గృహిణిని పోస్టులతో వేధించి ప్రాణాలు తీశారు

**ముందడుగు తమిళనాడు:**




అరచేతిలో ఫోన్ పట్టుకొని ఎవరికి, ఎప్పుడు ఏం మెసెజ్ చేస్తున్నారో అర్థం కాని పరిస్థితిలో కొంతమంది మనుషులు ఉన్నారు. ట్రోలింగ్ రాబందులు విపరీత పోస్టులతో వేధించి.. వేధించి ఒక గృహిణిని పీక్కుతిన్నారు. గత నెలలో చెన్నైలోని అపార్ట్‌మెంట్ ఫోర్త్ ఫ్లోర్ నుంచి అనుకోకుండా అమ్మ చంకలోని పాప జారిపోయి.. ఫస్ట్ ఫ్లోర్ బాల్కనీ మీదున్న రేకులపై పడ్డాడు. మెల్ల మెల్లగా కిందకు జారిపోసాగింది. దీంతో ఆ చిన్నారిని కాపాడేందుకు అపార్ట్‌మెంట్ వాసులు ప్రయత్నించారు. ఆ పాప కిందపడితే ఎటువంటి గాయం కాకుండా ఉండేందుకు కొందరు కింద బెడ్‌షీట్‌లు పరిచి నిలబడ్డారు. మరికొందరు మొదటి అంతస్తు బాల్కనీలోకి వెళ్లి ఆ పిల్లాడ్ని కాపాడే ప్రయత్నం చేశారు. చివరికి ఒక వ్యక్తి ఆ పసికందుని ఒడుపుగా పట్టుకొని కిందకు దించడంతో.. అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పాపను సేవ్ చేసిన వ్యక్తిని అందరూ అభినందించారు. ఈ క్రమంలోనే పాప తల్లి రమ్య నిర్లక్ష్యంగా వ్యవహరించిందని సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. ఆమె బిడ్డను ఎంతో ప్రేమగా, జాగ్రత్తగా చూసుకుంటుందని, అది అనుకోకుండా జరిగిన ప్రమాదమేనని ఇరుగుపొరుగు వారు స్పష్టంగా చెప్పారు. అయినా ట్రోలర్స్ చల్లబడలేదు. ఆమె కుంగిపోయేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టసాగారు. దీంతో తీవ్ర నైరాశ్యానికి లోనైన బాబు తల్లి రమ్య.. ఆత్మహత్య చేసుకుని తవును చాలించింది. ఆదివారం తన పుట్టింట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న రమ్యను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

# శృంగార సన్నివేశాల్లో మగవాళ్లకే టెన్షన్

## తమన్నా వ్యాఖ్యలు

**ముందడుగు సినిమా:**



శృంగార సన్నివేశాలు, ముద్దు సీన్లలో నటించేటప్పుడు హీరోయిన్లు ఇబ్బంది పడుతుంటారు అని అందరూ అనుకుంటారని, కానీ అది వాస్తవం కాదని ప్రముఖ నటి తమన్నా అన్నారు. శృంగార, ముద్దు వంటి సన్నివేశాల్లో హీరోయిన్ల కంటే ఎక్కువ ఇబ్బంది, టెన్షన్ ఫీల్ అయ్యేది హీరోలేనని చెప్పింది. తనతోపాటు నటిస్తున్న నటి ఇబ్బంది పడకూడదనేది హీరోల భావన అని, జాగ్రత్తగా ఉండాలని భావిస్తారని, ఎదుటివారు ఏమనుకుంటారో అని టెన్షన్ పడుతుంటారని తమన్నా వెల్లడించింది. ఇలాంటి భావనతో ఉండే సన్నివేశం సరిగా రాదని, హీరో, హీరోయిన్లు ఇద్దరూ ఒక అండర్‌స్టాండింగ్ తో నటించాలని, అప్పుడే సన్నివేశం బాగా వస్తుందని వెల్లడించింది.

# ఒక మహిళ కిడ్నీలో 300కు పైగా రాళ్లు

## ప్రతిరోజూ శీతల పానీయాలు తాగడమే కారణం

**ముందడుగు :**



ఒక మహిళ కిడ్నీ నుంచి వైద్యులు 300కు పైగా రాళ్లను తొలగించారు. ఆ స్త్రీ తన శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుకోవడానికి నీళ్లకు బదులు ప్రతిరోజూ శీతల పానీయాలు, జ్యూస్ లు మాత్రమే తాగేది. ఈ కృత్రిమ స్వీటెనర్లను ఉపయోగించి తయారు చేసిన పానీయాన్ని అతిగా సేవించడంతో మహిళ అస్వస్థతకు గురైంది. ఆమె సమస్యను గుర్తించడానికి డాక్టర్ అల్ట్రాసౌండ్ స్కాన్ చేసినప్పుడు, ఆమె కుడి కిడ్నీ ద్రవంతో ఉబ్బినట్లు, వందలాది రాళ్లు ఉన్నట్లు గుర్తించారు.

బాధితురాలికి సీటీ స్కాన్ నిర్వహించిన వైద్యులు.. ఆమె కిడ్నీలో 5 మిల్లీమీటర్ల రాళ్లు, 2 సెంటీమీటర్ల సైజులో ఉన్నట్లు గుర్తించారు. అంతే కాకుండా రక్తపరీక్షలో తెల్లరక్తకణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దీనికి గల కారణాలను తెలుసుకునేందుకు వైద్యులు అన్ని పరీక్షలు చేయగా, ఆమె చుక్క నీరు కూడా తాగలేదని తేలింది. నీళ్లకు బదులు బబుల్ టీ, ఫ్రూట్ జ్యూస్, ఆల్కహాలిక్ డ్రింక్స్ తాగడం వల్ల హైడ్రేట్ అవుతుందని డాక్టర్‌కి చెప్పింది. దీంతో ఆమె కిడ్నీలో చాలా రాళ్లు ఏర్పడ్డాయని వైద్యులు నిర్ధారించారు. 2 గంటల శస్త్రచికిత్స తర్వాత, వైద్యులు ఆమె కిడ్నీలో సుమారు 300 రాళ్లను తొలగించారు.

# సెల్ థెరపీ మానవాళికి దేవుడు ఇచ్చిన వరం

## EWBG LOOP మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభం

**ముందడుగు హైదరాబాద్:**




కణ పునరుత్పత్తిపై యూరోపియన్ వెల్నెస్ బయోమెడికల్ గ్రూప్ అధిపతి డా. అల్లం రవి, ప్రొఫెసర్ డాక్టర్ మైక్‌తో కలిసి తన బృందంతో కలిసి భారతదేశపు మొట్టమొదటి సెల్ థెరపీ సెమినార్‌ను నిర్వహించారు. సెల్ థెరపీ శాస్త్రీయ పరిణామాలపై భారతీయ వైద్యులు మరియు శాస్త్రవేత్తలను సమన్వయం చేయడానికి EWBG LOOP యాప్‌ను ప్రారంభించారు. లీ మెరిడియన్ హోటల్ లో మే 18 నుండి 20 వరకు జరిగిన మూడు రోజుల కార్యక్రమం, బయోరీజెనరేటివ్ ఆర్గాన్ ఇంప్రూవ్‌మెంట్ సెల్ థెరపీ టెక్నిక్‌లపై ప్రదర్శనలతో రెండవ రోజు ఆదివారం LOOP వెబ్ అప్లికేషన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా EWBG వ్యవస్థాపకులు ప్రొఫెసర్ మైక్ మాట్లాడుతూ సెల్ థెరపీతో, 4వ దశ క్యాన్సర్ రోగిని నయం చేయవచ్చు. సెల్ థెరపీ అనేది మానవాళికి దేవుడు ఇచ్చిన వరం అన్నారు. "ఇది కేవలం అధునాతన వైద్య సాంకేతికతతో అవయవాల పునరుత్పత్తి, ఇది దెబ్బతిన్న కణజాలాలు మరియు అవయవాలను మరమ్మతు చేయడానికి లేదా భర్తీ చేయడానికి మూల కణాలు లేదా ప్రత్యేక కణాలను ఉపయోగిస్తుంది." ఇది తీవ్రమైన చర్మ గాయాలు మరియు కాలిన గాయాలను నయం చేయడంలో సహాయపడుతుంది అన్నారు.

# కాకతీయ యూనివర్శిటీ నిరుద్యోగ జేఏసీ సంపూర్ణ మద్దతు

**ముందడుగు హన్మకొండ:**



హన్మకొండలో రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు, కేయూ జేఏసీ నేత డాక్టర్ మేడారపు సుధాకర్ అధ్వర్యంలో తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తెలంగాణ చౌరస్తాలోని జి.ఎస్ కన్వెన్షన్ హాల్ లో కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతారాయ్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలలో తీన్మార్ మల్లన్న ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, నిరుద్యోగ జెఏసి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లా కేంద్రాలలో నిరుద్యోగ జెఏసి తరపున మల్లన్నకు మద్దతుగా విద్యార్థి సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు,కేయూ జేఏసీ నేత డాక్టర్ మేడారపు సుధాకర్, తీన్మార్ మల్లన్న టీం కన్వీనర్ రజినీకాంత్, కుర్మా అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేష్, కేయూ జేఏసీ, కాంగ్రెస్ నేతలు బండి శ్రీనివాస్, ప్రేమ్ సుందర్, నూటెంకి సతీశ్, కేయూ నాయకులు గుండెటి సుమన్, మనుపాడు విష్ణు, రాజిరెడ్డి, అఖిల్, ప్రవీణ్, రాజ్ కుమార్, దక్షణమూర్తి, అభిరామ్, నవీన్, సాయిరాం, అరుణ్ పట్టభద్రులు విద్యార్థులు పాల్గొన్నారు

ముందడుగు
మంగళవారం, 21-5-2024, హైదరాబాద్

## హైదరాబాద్‌లో ప్రారంభమైన

# వన్ 8 కమ్యూన్

### విరాట్ కోహ్లీ ఇష్టపడే మెనూ దీని ప్రత్యేకత

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ హైటెక్ సిటీ నడిబొడ్డున, వన్8 కమ్యూన్ నగరం యొక్క డైనమిక్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ సరికొత్త రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఇందులో పాక ప్రకృతి దృశ్యాన్ని పునర్నిర్వచించటానికి హామీ ఇస్తుంది. వన్8 కమ్యూన్‌ను భారత లెజెండరీ క్రికెటర్ విరాట్ కోహ్లీ స్థాపించారు. మనోజ్ మంచు పుట్టినరోజు సందర్భంగా ఆయన వేడుకలను వన్8 కమ్యూన్ నిర్వహించింది, ఈ ఈవెంట్‌లో సినీ పరిశ్రమలోని మంచు లక్ష్మి, నాని, అడివి శేష్, నిఖిల్, తేజ సజ్జ, సుధీర్ బాబు, సందీప్ కిషన్, ఆకాష్ పూరి, అభిరామ్ మరియు ఇతర టాలీవుడ్ నటులు, నిర్మాతలు మరియు దర్శకులు హాజరయ్యారు. "వన్8 కమ్యూన్ ఎల్లప్పుడూ ఆహారం మరియు కమ్యూనిటీ యొక్క




శక్తి ద్వారా ప్రజలను ఒకచోట చేర్చే స్థలాన్ని సృష్టించడం" అని వన్ కమ్యూన్ కోఫౌండర్ వర్తిక్ తిహారా అన్నారు. "హైదరాబాద్‌లో మా సరికొత్త ప్రదేశంతో, మేము నగరం యొక్క చైతన్యాన్ని సంగ్రహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మరియు స్థానిక రుచులను జరుపుకునే మరియు కనెక్షన్లను పెంపొందించే నిజమైన ప్రత్యేకమైన భోజన అనుభవాన్ని మా అతిథులకు అందించండి అన్నారు. మద్యం ప్రియులకు వారి ఆలోచనలకు అనుగుణంగా వివిధ రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## హైదరాబాద్ నగరంలో

# కో లివింగ్ కల్చర్..?

- పెళ్లి కాకుండానే కలిసి ఉంటున్న అమ్మాయి, అబ్బాయిలు
- అబ్యూజ్, క్రైమ్స్‌కు దారి తీసే అవకాశాలు

**ముందడుగు ప్రత్యేకం:**

అరచేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో తెలుస్తోంది.. అందులో వివిధ దేశాల కల్చర్ కూడా తెలుసుకొని అలవాటుపడుతున్నారు. అలాంటిది ఇప్పుడు కో లివింగ్ కల్చర్ హైదరాబాద్ నగరంలో షరామామూలుగా మారింది. పెళ్లి కాకుండానే రిలేషన్ షిప్‌లో అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి ఒకే హాస్టల్ లేదా ఫ్లాట్ తీసుకొని ఉండటాన్ని కో లివింగ్ అంటారు.

**లీగల్‌గా ఎలాంటి తప్పలేదు కానీ**

మన సంస్కృతి, సాంప్రదాయాలకు కాస్త భిన్నంగా అనిపించినా ప్రస్తుతం ఈ కో లివింగ్ కల్చర్ ట్రెండ్‌గా మారింది. హైదరాబాద్ నగరంలో అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, మాదాపూర్, గచ్చిబౌళి, కేపీహెచ్‌బీ, రాయదుర్గం వంటి ఏరియాలో ఈ కో లివింగ్ కల్చర్ కాస్త ఎక్కువగా కనబడుతుంది. ముంబాయి, ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరు వంటి రాష్ట్రాల్లో ఈ తరహా లివింగ్ స్టైల్ ఉండేది. క్రమేపీ అది తెలుగు రాష్ట్రాలకు సైతం పాకింది. సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం ఇద్దరు



చర్చనీయాంశంగా కో లివింగ్ కల్చర్

మేజర్లు కలిసి ఉండడంలో లీగల్‌గా ఎలాంటి తప్పులేదని చెబుతున్నా.. ఈ కో లివింగ్ రిలేషన్స్ ద్వారా కొన్ని అబ్యూజ్, క్రైమ్స్‌కు దారి తీసే అవకాశాలు కూడా లేకపోలేదు.

**మనస్పర్ధలు వచ్చినప్పుడు సమస్య**

కో లివింగ్ అంటూ యువత పెడదోవ పడుతున్నారని సామాజిక వేత్తలు అంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న కల్చర్‌ను హైదరాబాద్‌కు సైతం తీసుకువచ్చారని.. అమ్మాయిలు, అబ్బాయిలు ఒకే రూమ్‌లో ఉన్నంతసేపు ఎలాంటి సమస్యలు ఉండవు కానీ.. వారి మధ్య మనస్పర్ధలు వచ్చినప్పుడు ఇద్దరి కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలతో బెదిరింపులకు దిగడం వంటి ఘటనలు సైతం తెరపైకి వస్తున్నాయని అంటున్నారు.

తల్లిదండ్రులకు తెలియకుండా యువత ఇలాంటి కో లివింగ్ రిలేషన్స్‌లో ఉంటున్నారని అది మంచిది కాదని అంటున్నారు. కో లివింగ్ హాస్టలు హైదరాబాద్ నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, సాధారణమైన హాస్టల్స్‌కు ఎలాంటి అనుమతులు, నిబంధనలు ఉంటాయో వీటికి కూడా అవే వర్తిస్తాయని అంటున్నారు న్యాయ నిపుణులు. పిల్లల కదలికలపై పేరెంట్స్ కూడా ఓ కన్నేయాలని సజెస్ట్ చేస్తున్నారు. కో లివింగ్ కల్చర్ ప్రస్తుతం నగరంలో చర్చనీయాంశంగా మారింది. కో లివింగ్ కల్చర్‌ను కొందరు సమర్థిస్తే మరికొందరు మాత్రం తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరిస్తున్నారు.

# ఇక్కడ గోవులను దత్తత ఇస్తారు

### ఇప్పటివరకు 6వేల ఆవులను రైతులకు ఇచ్చారు ■ మే నెల 24వ తేదీ నుంచి దత్తత కార్యక్రమం

**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**

ప్రకృతి వ్యవసాయంలో ఓ మూత్రంతోపాటు, ఆవు పేడను ఎక్కువగా వినియోగిస్తున్నారు. అయితే ఇప్పుడు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఏలూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చిన వెంకన్న దేవస్థానం తమ గోశాలలోని గోవులను దత్తత ఇచ్చే కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు దేవస్థానంలోని గోవులను దత్తత తీసుకునే కార్యక్రమాన్ని మే నెల 24వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆవులు కావలసిన



వారు తమ పొలానికి సంబంధించి పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలు, 100 రూపాయల స్టాంప్ పేపర్, ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ సర్టిఫికెట్ జిరాక్స్, తమ కాంటాక్ట్ నెంబర్ తో ఆలయ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలా నమోదు చేసుకున్న రైతులకు మే నెల 24న గోశాలలోని ఆవులను రైతులకు దత్తత ఇవ్వనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గతంలోనూ ఆలయ గోశాలలో గో దత్తత కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఇప్పటివరకు సుమారు 6వేల ఆవులను రైతులకు దత్తత ఇచ్చారు. ఇటీవల దేశవ్యాప్తంగా లంఫి స్కిన్ వ్యాధి రావడంతో గోవులను స్వీకరించడం, దత్తత ఇచ్చే కార్యక్రమాన్ని నిలిపివేశారు. అయితే వ్యాధి ప్రభావం తగ్గడంతో తిరిగి మరల దత్తత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ద్వారకాతిరుమల దేవస్థానం గోశాలలో పుంగనూరు, కపిల, కాంక్రీట్, గిర్, ఒంగోలు, నిమారి, మైసూర్ జాతికి చెందిన ఆవులు, ఎద్దులు ఉన్నాయి. వీటిని మాత్రం రైతులకు దత్తత ఇవ్వరు. ఎంపిక చేసిన దేశవాళీ, జెర్సీ జాతులకు చెందిన గోవులను మాత్రమే రైతులకు దత్తత ఇస్తారు. ఇప్పటికే చుట్టుపక్కల ప్రాంతాల రైతులు గో దత్తత కార్యక్రమంలో పాల్గొనటానికి దేవస్థానం కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. దత్తత తీసుకున్న రైతులు ఆవులను సంరక్షిస్తూ వాటి ద్వారా వచ్చే గోమూత్రం, ఆవు పేడతో ప్రకృతి వ్యవసాయం చేసి నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు అందించడమే దత్తత ముఖ్య ఉద్దేశ్యమని ఆలయ అధికారులు చెబుతున్నారు.